


# "అటుందిటు"

హైదరాబాద్ సంబంధం అనగానే సర్వలక్ష్మికి ఎంతో ఆనందం కలిగింది. ఖమ్మం సంబంధం బదులు ఆ సంబంధం కుదరాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

కనీసం ఏ దేముడైనా కరుణించి వుంటాడు. హైదరాబాద్‌లో నేషనల్ సేంపిల్ సర్వే కార్యాలయంలో పనిచేసే రమేష్‌తో ఆమె వివాహం జరిగిపోయింది.

సర్వలక్ష్మికి హైదరాబాద్‌లో కాపరం కావాలనుకోడానికి ముఖ్య కారణం అక్కడున్న టేంక్‌బండ్. అనేక తెలుగు సినిమాల్లో టేంక్‌బండ్‌ని చూసింది. పెళ్ళయ్యాక తన భర్తతో టేంక్‌బండ్ మీద వుండే సిమెంట్ బెంచీమీద కూర్చుని నీళ్ళ వంక చూస్తూ 'మనసు స్పందించే తియ్యటి మాటలని మాట్లాడుకోవాలనే కోరిక సర్వలక్ష్మిలో ప్రబలంగా వుంది.

రమేష్ ఇల్లు వాల్మీకినగర్‌లో. అది టేంక్‌బండ్‌కి కిలోమీటర్‌లోపే అని తెలిసాక సర్వలక్ష్మి మరి కాస్త సంతోషపడింది

సర్వలక్ష్మి ఊహలకి, ఆశలకి సరిపడే మనిషి కాదు రమేష్. ప్రాక్టికల్, రొమాంటిక్ కాదు. ఉద్యోగం చేస్తూ, తీరిక వేళల్లో చిన్న ఫొటో స్టూడియో నడుపుతున్నాడు అవుట్‌డోర్‌లో ఫొటోలు తియడానికి తరచూ వెళ్తూంటాడు. సర్వలక్ష్మి సాయంత్రాలు టేంక్‌బండ్‌కి వెళ్ళి కూర్చుందామని ఎన్నిసార్లు అడిగినా ఏదో పనిపడటంతో కుదరనే లేదు

వానాకాలం వచ్చేసింది, అసలు కుదరదు తర్వాత చలికాలం. ఇంట్లోనే చలి భరించలేని సర్వలక్ష్మి టేంక్‌బండ్‌కి వెళ్ళలేదు

సర్వలక్ష్మికి పెళ్ళయిన పదకొండు నెలల తర్వాత నెలతప్పింది సంతోషంతో ఏంకావాలని అడిగాడు రమేష్. ఇంకేం అడుగుతుంది?

ఇద్దరు ఆ సాయంత్రం టేంక్‌బండ్‌కి వెళ్ళి కూర్చున్నారు. అనేకసార్లు వంటరిగా వచ్చినా. భర్తతో రావడంవల్ల సర్వలక్ష్మికి ఎంతో ఆనందంగా వుంది ఆ అనుభవం.

అతని చేతిని తన చేతిల్లోకి తీసుకుని ఆ చెయ్యిని నిమురుతూ చెప్పింది

"అక్షరాలకి అందని అనుభూతి ఇది"

అలా వూరికే అక్కడ కూర్చోవడం అంటే విలువైన కాలాన్ని వృధా చేసుకోవడమే అని భావించే రమేష్‌కి ఎంతో విసుగ్గా వుంది.

"రేపు వుదయం కూరగాయలేం తీసుకురానా?' అడిగాడు.

సర్వలక్ష్మి కొద్దిగా చిన్నబోయింది కాస్సేపు ఏం మాట్లాడలేకపోయింది.

"ఈ వారం అరవై రెండురోల్స్ ఖర్చయ్యాయి నెగెటివ్‌లని వుంచడానికి ఓ కొత్త రేక్ చేయించాలి బిల్ పుస్తకం సైజు తగ్గిస్తే..."

"ఇక వెళదాం" లేచి నిలబడి చెప్పింది సర్వలక్ష్మి వెంటనే

*　*　*

రెండేళ్ళ తర్వాత ఓ రోజు సాయంత్రం సర్వలక్ష్మి వాళ్ళిద్దరి కోసం ఎదురు చూస్తోంది. ఆమె మరిదికి పెళ్ళయింది. తోడి కోడలు కాపరానికి వచ్చి వారమయింది.

"టేంక్‌బండ్ దాకా వెళ్ళొస్తాం వదినా" చెప్పాడు మరిది అరగంట క్రితమే.

తనమరిది రమేష్ లా ప్రాక్టికల్ కాదు స్పందన వున్న వ్యక్తి అని సర్వలక్ష్మికి తెలుసు. అతని భార్య ఆ విషయంలో తనకన్నా ఎంతో అదృష్టవంతురాలు అని అపేక్షిస్తూ అనుకుంది సర్వలక్ష్మి

టేంక్‌బండ్ నించి తిరిగివచ్చాక మరిదిని చనువుగా అడగింది.

"ఏం చేసారక్కడ?"

"ఏమిటో వదినా నా పెళ్ళానికి డబ్బు పిచ్చి తప్ప ఇంకోటి లేదు. ఏదైనా సరదాగా నాలుగు మాటలు మాట్లాడనివ్వకుండా, మీ అన్నయ్యలా మీరు ఓ స్వంత వ్యాపారం చేయకూడదు? మీది పెద్దాఫీసుగా 'మీ కొలీగ్స్‌కి బట్టలు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లా అమ్మొచ్చు' అంటూ మొదలెట్టింది. చెప్పాడతను.

